# కర్రోడు చచ్చిపోయినాడు

**'అదిగో, అనుకుంటుండగానే వచ్చింది చూడండి గబ్బులంజ!' అనింది రెడ్డమ్మ అక్కసుగా.**

"అమ్మ యెనకబడే తిరుగుతాది. దీనికేం రోగమో! మద్దాన్నం కూడు తెచ్చే దాకా గుడిసెకాడ వాన్నిచూపెట్టుకు నుండకూడదూ...... చుప్పనాతి ముండ. అమ్మరావడమే అంబలి పొద్దుదాటినాక. అమ్మయెనకాల యిదొకటి తరిపి దూడ మాద్రి తగులుకునీ," అనింది కోడలు బాలమ్మ. రెడ్డమ్మ జవితి(1)మీద వేసిన మంచంలో కూకుని కుడికాలు మడతపెట్టి మంచంలోనే వుంచుకుని, యెడంకాలు నేలమీద మోపి, భుజంమీద సెలగోలు వేసుకునుంది. (ఆమె ఇప్పుడే బర్రె గొడ్లను బైటికి తోలి వచ్చింది).

బాలమ్మ...... తలదువ్వి జడవేసుకుంటూ, గోడకున్న అద్దంలో నిలువునా జూసుకుంటూ, ఒక అడుగు వెనక్కివేస్తూ, రెండడుగులు ముందుకేస్తూ, జడముందుకేసి చూసుకుంటూ, అద్దంలోనే బోడి బొమ్మను చూసి ఆపైమాట అనింది. రెడ్డమ్మ, అనుకుంటుండగానే....' అనేప్పటికి బోడిని గురించి మాత్రం అనుకోలేదు. కోడలు అద్దంలో జూసుకోడం చూస్తోంది. ఒడినిండా డబ్బుతో, ఒంటినిండా బంగారంతో బరువుగా, పరువుగా వచ్చిన కోడలు వీసమెత్తు మాట విసిర్తే. తననూ, తన మాటనూ కట్టగట్టి వీధిలో విసరేస్తుంది. ఇద్దరు పిల్లలు పుట్టినా దీనికింకా ఈ యేషికాలేంది? మంచంలో కూకుని, కుంపటి మాద్రి మండిపోతున్న రెడ్డమ్మ కోడల్నునాలను కున్నమాట బోడిమీద కక్కేసింది. అత్త తనను గురించి ఏమనుకుంటుందో తెలియని కోడలు మాటకలిపింది. దాన్తో, కోడలు మీద కోసం తగ్గింది అత్తకు. "ఫరవాలేదు..... యెన్ని యేషికాలేసినా లాభం నష్టం గమనించడంలో జాగర్తగానే వుంది." ఆ రుజువు దొరకడంతో, అత్తా కోడలూ కలిసినారు.

---

*(1) ఒకరకంగా అరుగులాగానూ, సైజీమాదిరి గానూ వుంటుంది. దానిలోపల ధాన్యం దాచుకోడానిక్కూడా పని కొస్తుంది.*

"మేం గాబట్టి యేదో పిల్లల్తల్లి ....... మొగదిక్కులేని ముండరాలు పాపం! అనిపనికి పిల్చుకుంటున్నాంగానీ, ఈ వూళ్ళో ఇంగెవరన్నా నిన్ను పనికి పిల్చుకుంటారేమే నాగీ?"

"ఎవరన్నా దీన్నెందుకు పిల్చుకుంటారు? బాగా పన్జేసేవాళ్ళనే పిల్చుకుంటారు. మనగ్గతిలేకనే దీన్ని పిల్చుకుంటున్నాం." బాలమ్మ అప్పటికి జడపని పూర్తయినట్లు వెనక్కి పడవేసుకుంది. దువ్వెనతో ముంగురుల్ని మెత్తగా ఒత్తుకుంటూ, చిత్తారిపని చేస్తోంది. రెడ్డమ్మ కోడలు పక్కకు వోరగా చూసింది. కోడిలింకా అద్దంలోనే వుంది.

"మనగ్గతిలేక కాదు. దానిగ్గతిలేదని పిల్చుకుంటున్నాం." చురుగ్గా, కరుగ్గా అని "మెతుకులు చల్లితే కాకులక్కొదవా?" అందిగర్వంగా.

బోడి, వాళ్ళమ్మ నాగికెదురుగ్గా, వడ్ల రాశికి యెడంగా, గాటిపాపల దగ్గర కంబాని కానుకుని నిలబడింది. దాని కుడి పక్క చంకలో కర్రోడున్నాడు. గుమ్మం గుండా పరుగెత్తుకొచ్చిన లేత యెండ వడ్ల రాశిపై కెక్కి "జారుడు ఆట" ఆడుకుంటోంది. గాటిపాపల వారన ఉన్న రొచ్చుగుంతల చుట్టూ ఈగలు జుమ్మ మంటున్నాయి, గుంతల్లోపలున్న రొచ్చు మాగుడు వాసన చిక్కగా ముక్కుల కెక్కుతోంది. పిల్లలకోడి పేడ కాళ్ళతో వడ్లరాశి అడుగున చిదుగుతూ పిల్లల్ని కేకేసి పిలుస్తోంది. దూది బొమ్మల్లాంటి పిల్లలు తల్లిచుట్టూ చుట్టుకున్నాయి. దువ్వ తలమీద పడకుండా, చిరుగుల చెంగు కప్పుకుని, చేటతో వడ్లు ముంచుకుని చెరుగుతోంది నాగి. రెడ్డమ్మ మాటలు నాగి మనసును చెరుగుతోన్నాయి. "ఈ వూళ్ళో ఇంగెవరన్నా నిన్ను పనికి పిల్చుకుంటారేమే!" ఎట్లా పిల్చుకుంటారు? పిల్చినప్పుడు రెడ్డమ్మ పోనిచ్చింది గనుకనా? ఆమెకు మూడొందల రూపాయలు కట్టి ఎవరు యిడిపించ్చు కుంటారు తనను? పదైదేండ్లు కట్టం సేసిన మొగుడే, తననూ తన పెండ్లాన్నీ యిడిపిచ్చు కోలేక పానం యిడిసినాడు. రెడ్డమ్మ పాటకు బాలమ్మ దరువింగా బాగుంది. అత్తమెత్తగా కోత పెడుతూంటే, కోడలు వొత్తుగా కారం కూరుతోంది, "నేను పన్జేయలేన్దాన్ని, కూల్దండగదాన్ని. నాతల్లుల్లారా! నన్నొది లేయండి. మీకు పదియేల దండాలు పెడ్తాను" అంటే వొదుల్తారా? అసలు తనట్టా అడగడానికన్నా వుందా? వొట్టి కట్టం సేయిచ్చు కునేది వోళ్ళే, వొట్టి మాటలు సెప్పేదీ వోళ్ళే!

బోడి కర్రోన్నెత్తుకుని కంబాని కానుకుని అజంతా, ఎల్లొరాల్లో (లేని) శిల్పంలా నిలబడి, చూపుచివర్లతో అటు రెడ్డమ్మనూ, ఇటు బాలమ్మనూ, పలచగా తాకి....... తాక్క యింకెందుకో సూటిగా చూస్తోంది. బోడికి పన్నెండూ, పదమూడేళ్ళుంటాయి. అయితే, ఆ

వయసుకు వచ్చే అంచులు తీరలేదు. బోడింకా బోడిగానే వుంది. తన ఈడువాళ్ళంతా పనికి పోతూంటే, తనకు మాత్రం పనికి పోవడానికి వీల్లేదు. మొదట్లో...... బోడికి పనికి పోవాలని యెంతో కోరిగ్గా వుండేది. కాయలేరనో, కలుపు పీకనో, తనూ పనికిపోయి గింజలో, పైసలో తెచ్చి తల్లికిస్తోంటే ....... "అబ్బ! యెంత బాగుంటుందో అప్పుడు!" అనుకునేది. "అమ్మా! నేనూ కూలికి పోతానే" అని గోముగా అడిగేది. "వద్దులే కర్రోన్నెత్తుకోవద్దా" అనేది అమ్మ. "కర్రోన్ని వొక్కరోజు నువెత్తుకోయే" అని జాలి జాలిగా అడుగుతుంది. జాలి జాలిగా అడిగినా అమ్మ జాలిపడదు. పైగా కసురుకుంటుంది. "ఒక్కరోజు యెత్తుకోడం కాదు. యెన్నాళ్ళయినా యెత్తుకుని గుడిసెలో పండుకుంటాను. కూడు నువు తెచ్చి పడేసేట్టయితే ఇంగేం బదనాయం? అదిగాదు బయం. రెడ్డమ్మ కాడికి పోవాల్నా? లేదా? వాన్నెత్తుకుని పనెట్టాసేసేది? వద్దులేయేతల్లీ నువు పనికి పోకపోయినా బతుకుతాం. నేను రెడ్డమ్మ గారి పనికి పోకపోతే మాత్తరం బతకలేం." బోడి యెన్నిసార్లు పనికి పోతానని బతిమాల్నా, వాళ్ళమ్మ నాగి అనేమాట అదే! రెండు మూడేండ్లు గడిచినా ...... ఇప్పటికీ అదే ఇబ్బంది! అయితే........ ఇంతకు ముందున్న పనికి పోవాలన్న బలమైన కోరిక రానురానూ, బోడిలో అణగి పోయింది. తనతోటి పిల్లల మాద్రి తనూ పొలాల్లోకి పనికిపోవడానికి లేదు. ఒక్క రోజు గూడా.... ఒక్క రోజంటే వొకటే రోజు పోవడానిగ్గూడాలేదు. "పెండ్లి క్కాదు, తిర్నాలక్కాదు, ఆకిరికి సిలిమా ఆటక్కాదు. ఒక్క రోజు పనికి పోతానంటే వల్లగాలేదు " పగలంతా యెవ్వరూ వుండని ఇండ్ల మధ్య తిరిగి తిరిగి, నిరాశను మోసినట్లు కర్రోన్ని మోసి...... మోసి ఇప్పుడు బోడి మారిపోయింది. ఉత్సాహం లేని, వొట్టి మొద్దుగా వుంటుంది. పనికి పోవాలనుకోడం కాదు, పొమ్మన్నా పోదన్నట్టుగా వుంటుంది. "నీకేం వుమ్మాదం[2] పట్టిందే! యెంత పిలిచినా పలికి చావవు!" అని తిడుతూంటుంది నాగి. ఇంకా కోపమొచ్చినప్పుడు, కొడుతుంది. అప్పుడు మాత్రం యేడుస్తుంది బోడి. "వాడేమో రోగి ముండాకొడుకు నువ్వేమో మొద్దు ముండవు. అబ్బుడేమో అట్టపాయె! బతికున్న నేనా...... బాకిల్లోనే సచ్చిపోతీ" అని నాగీ యేడుస్తుంది, అమ్మ యేడుపు మొదలవుతూనే, బోడి తనయేడుపు ఆపుకుంటుంది. బోడి చంకలో వున్న కర్రోడు కళ్ళు తెరుచుకున్నాడో, మూసుకున్నాడో చెప్పడం కష్టం. వాడి వయస్సు చెప్పడం అంతకంటే కష్టం. "వాళ్ళనాయిన చచ్చినాక పుట్నాడు" అంటుంది నాగి. కర్రోడి వయస్సు ఆ ఆధారంతో తేల్చవలసి వుంటుంది కనుక్కోవాలంటే. వాళ్ళనాయిన చచ్చిపోయినాక, కర్రోడు పుట్నాక, నాగీ, బోడీ యెట్లా బతికినారో చెప్పడం కష్టం కాదు...... అసాధ్యం! వాడు పుట్టి, ఆర్నెల్లవయసు వచ్చింది మొదలు బోడి చంకకు అతుక్కున్నాడు కాయమాద్రి, దాన్తోపాటే పుట్టినట్లు!

---

2. ఉన్మాదం

ఎప్పుడో రాత్రిళ్ళు వూడిపోతా డేమోకానీ, మిగతాప్పుడంతా బోడిమీదనే వుంటాడు.

"మీ యమ్మ వచ్చి తూమెడు వడ్లన్నా చేసిందో లేదో, అప్పుడే దూకితివి. యింటికాడుండటానికి నీకేం దొబ్బులయిందే!" ఇంతకుముందు కోడలన్నమాట ఈసారి అత్త అందుకున్నది. "అదేమొయిన పన్జేసి అమ్మ ఆయాసపడ్తదని, అలుపు తీర్చడానికనొచ్చింది బిడ్డ! ల్యాక, మద్దాన్నమయింది. బువ్వతిందామనొచ్చిందో."

నాగికి బోడి మీద కోపమొచ్చింది. "రెడ్డమ్మగారింటికి రావొద్దు. ఆయమ్మ పన్ని కుంటయితదని తిడ్తాది" అని పొద్దున సెప్పి వచ్చినా రోజూ రావడం మానుకోదు. ఇది రావడం మాన్నేదుగదాన్ని ఈళ్లు తిట్టడం మానరు. బోడి అట్లా నిలబడి చూస్తోనే వుంది. వాళ్ళతిట్లు, అమ్మకోపం, ఇవేవీ గమనించడంలేదు. లోపలింటి గుమ్మంనించీ బాలమ్మ కొడుకు తప్పటడుగుల్తో బైటకొచ్చినాడు. బోడి దిక్కుచూసి నవ్వుతూ చెయ్యూపినాడు. బోడి అట్లనే చూస్తోంది. తెల్లగా, బొద్దుగా......... మిసమిసలాడ్తోన్నవాన్ని, వొక్కసారిగానీ యెత్తుకుంటే. యెంత మెత్తగా, యెట్లావుంటుందో!

"ఏమిటే వాన్నట్టా సూత్తన్నావు? దిష్టికొట్టేవే" అని తమాషాకన్నట్టుగా నవ్వు కలిపింది రెడ్డమ్మ. బాలమ్మ సింగారం ముగించుకుని, కొడుకునెత్తుకుని ముద్దు పెట్టుకుంది. "లాలపోసుకుందు పా - నాయినా" అని వాని పొట్టమీద తనమొకం రుద్ది కిలకిలా నవ్వుతోన్న వాన్ని బుజం మీద, వీపు మీద వేసుకుని ఆనందిస్తోంది. బోడి చోద్యంగా చూస్తోంది. ఎన్నాళ్ళనించో అనుకుంటోంది. వొక్కసారి యెత్తుకుని యెట్లావుంటుందో చూడాలని, చూస్తేనే దిష్టికొడుతుందని తిడుతోంటే యెత్తుకోడానికిస్తారా? అట్లాటివాన్ని యెత్తుకోమంటే యెప్పుడూ యెత్తుకోవచ్చు, ఇసుగే రాదు. ఆ పిల్లవాన్ని తల్చుకున్నప్పుడల్లా క్రోడు పేడ పురుగులా కనబడతాడు బోడికి. ఆ పిల్లవాడెప్పుడూ నవ్వుతోనే వుంటాడు. క్రోడికి నవ్వురానేరాదు.

బాలమ్మ రెండు చేతుల్తో కొడుకు నదిమి పట్టుకుని గుండెకు హత్తుకుంది. బోడి చేయి చంకలో వున్న క్రోడిచుట్టూ బిగుసుకుంది. వాడి యెముకలు నొప్పి పెట్టి 'గీ' మన్నాడు.

"ఆ.... ఆదో! వాన్నేడిపిచ్చి అమ్మ దగ్గర్నే దిగ్గులికి పోవచ్చని యెత్తేసింది."

"నే చెప్పలేదూ? నాగి ఇయ్యాల వడ్లు సేసినట్టే, రేపు మనం మిషన్కు పట్టిచ్చినట్టే"

"ఎద్దులకు పని వుసిలేదన్ని వాడొకపక్క యెగిరి పడుతుండె? ఎట్టనో సెప్పి

రేపొకపూటను మిషనేయిచ్చడానికి పంపుదామనుకుంటి. రోజా....... రోన్ని రోన్ని దంచమంటే, ఈడనొప్పి, అడనొప్పి, అంటావు. మిషన్కే పోతాం సెయ్యమంటే ఇట్లా! కట్టంలో యెల్తుండొచ్చుగానీ, కంచంలో యెల్తుండకూడదు మళ్ళా. నీ మొగునికీ, నీకూ యెప్పుడో బాకీవున్నట్టేమేం"

"రావొద్దనిసెప్తే మళ్ళెందుకు వచ్చినావే ముదనట్టందానా, వాడేద్సకపోయినా యెత్తుకొత్తావేమే!" నాగి, బోడి జుట్టుపట్టుకుని గుంజి, తలకాయ కంబానికేసికొట్టింది. కోపం తీరక వీపున గభీ గభీమని గుద్దింది. బోడీ, క్రరోడూ ఇద్దరూ యేడుపందుకున్నారు. "ఫో .... ఇక్కన్నించీ సావు......." కంఠం లో నరాలూ, కడుపులో పేగులు తెగేట్లు అరిచింది నాగి. "ఓసి నీరోసం కాలిపోనూ ....... బాగానే వుంది సంబడం, ఊరకుంటే వుత్తముండా, యేమన్నా అంటే యెదవముండా! బాగుందే వాటం."

నాగి మాట్లాడుకుండా తనపని చేసుకుంటోంది.

★ ★ ★

రెడ్డమ్మ గారింట్లో ఇప్పుడు పసుల్తీతగాడు లేడు, పరారీ అయినాడు. చీకట్లోనే వచ్చి గొడ్లకాడ పేడా రొచ్చూ యెత్తడం నాగివంతే. ఇప్పుడు క్రరోడు లేనందువల్ల బోడి కూడా పొద్దునే వచ్చి ఆ పనిలో అమ్మకు సాయపడుతుంది. ఇప్పుడు కూడా బోడి ఎవరికన్నా పొలంపన్లకు పోవడానికి లేదు. రెడ్డమ్మగారికి పసుల్తీతగాడు దొరికేదాకా పేడా, రొచ్చూ తియ్యాలిగదా. "పొద్దుపొడిసేతలికి గొడ్లకాడ కసువుండకూడదు. కాపోనికి దరిద్రం" అంటుంది రెడ్డమ్మ. అంత పని తెల్లారేతలికి నాగి వొక్కతీ సెయ్యలేదు. అందుకు బోడిని తోడుగా పిల్చుకొస్తుంది. బోడి రోజూ బాలమ్మ కొడుకును చూస్తూనే వుంది. 'క్రరోడు చచ్చిపోతే బాగుంటుంది' అని అప్పుడప్పుడూ వాడు బతికినప్పుడు అనుకుంది. తీరా వాడు చచ్చిపోయినాక అనుకున్నంత బాగా లేనట్లుంది. ఇట్లా యెందుకుందో బోడికి తెలీదుగానీ, క్రరోడెట్లా చచ్చిపోయినాడో అదిమాత్రం బాగా గుర్తుంది.

"అమ్మా! రేపు పనికి రాలేను" అంది నాగి.

"ఏం? ఏమయింది? ఇంటికాడ పండుకుంటవా?" అనడిగింది రెడ్డమ్మ. అప్పటికే కోపమొచ్చింది ఆమెకు.

"క్రరోడికేం బాగాలేదు. ఆసుపత్రిల చూపిచ్చు కుందామనీ, అట్టనే న్రాల్రూపాయలు లెక్క కూడా."

"ఊ.... లెక్క అడగందెప్పుళ్లే గానీ, వాని కే మొచ్చిందిప్పుడు?"

పక్కన్నే బోడి చంకలోవున్న కర్రోన్ని అట్లా చూసింది.

"మూసినకళ్ళు తెరవలా....... కడుపుకేం బెట్టినా కక్కుకుంటాడు" రోగాన్ని వివరించింది నాగి.

"ఏం? మామూలుగానే వున్నాడే" అని కళ్లు చిట్లించి, ఆశ్చర్యంగానూ, అంతే పొడుగ్గానూ మాట సాగదీసి, "కక్కుకోడమంటే, కక్కుకోడూ మీరు నానాకంపెడితే!" అనింది కొంచెం యేవగింపు మొకం పెట్టి.

"మేం నానాకం ఏం పెడతాం తల్లీ! మీరు పెట్టిన కూడు తప్ప మాకేముంది?"

"మేం పెట్టిన కూడేమల్ల, ఎక్కి తొక్కి తిన్నా యింత మిగిలేట్టు పెడతాం. మీరు శకితికి మించి తింటే మాకూడేం జేత్తాది? ఆహా అయితే కూడు పెట్టడం కూడా తప్పేనను?" అని దారిమార్చిన తర్కం యెత్తింది. నాగి భయపడింది. ఇట్లా యెత్తుగడలేసి....... "ఆసుపత్తిల్లేదు, మాసుపత్తిల్లేదు. మాసూలయేదాకా పోడానికీల్లేదు" అంటుందేమో!

"అవు తల్లీ....... మీరు పెట్నట్టు కూడు పెట్టేటోళ్ళు ఈ వూళ్ళో వుండారా!" ఆమాట అంటున్నప్పుడు, యెన్ని సార్లో పడిన అరగడుపు, పరగడుపుల బాధ వొకతట్టూ, అవసరం బాధ వొకతట్టూ, నాగిని నలిపినాయి. కండల్లో నీళ్లూరినాయి.

"ఏంది?" అంటూ బాలమ్మ వచ్చింది.

"కొడుకు మూసినకళ్ళు తెరవలేదంట, కక్కుకున్నాడంట. రేపు ఆసుపత్తిరికి పోయి పెద్ద డాక్టరుకు చూపిత్తాదంట" అని నవ్వింది రెడ్డమ్మ.

"వాడు కండ్లు తెర్సి చూసిందెప్పుడు? పుట్నప్పట్నుంచీ అట్టనే వున్నాడు" అని పెదవివిరిచింది బాలమ్మ. రెడ్డమ్మ మళ్ళా కొంచెం గట్టిగా నవ్వి.... "ఏం లేదుపోయే యెర్రిదానా! నీదంతా వొట్టనుమానం. ఆసుపత్తిరికి తిరిగి సచ్చి, లెక్కకర్చు పెట్టుకుని, నీళ్ళమందు తెచ్చుకోడమెందుకు! ఒకేల కక్కుకున్నాడనుకో......... పిల్లోళ్ళు కక్కుకోడం పెద్ద బెమ్మాండమా? మొన్న మా వాడింతే గదూ..... ఒకటే మొయిన కక్కుకోడం! అందరూ ఆసుపత్తిరికి పొమ్మనే వాళ్ళే. బాలమ్మ గూడా బయపడింది. ఏం బయం లేదని సెప్పి వాముసూరి పోసేతలికి...... ఒక్కటే ఒక్కపూట - సూడెట్టావున్నాడో! ఇదో బాలమ్మా ఇంట్లో

దేవుని-రూముకాడ్ర-వాముంది తీసుకురా పాపం! నాగికిద్దాం, బయపడి సస్తాంది. నిజమేలే....... పిల్లోళ్ళకు బాగ లేకపోతే బయమే మల్ల. ఇందులో నా పిల్లో డయినా, నీ పిల్లోడయినా వొకటే! నువ్వయినా, నేనయినా వొకటే..."

బాలమ్మ చిటికెడువాము కాగితంలో కట్టి తెచ్చింది.

"ఇదో ......... బాగా నూరి నీళ్ళల్లో కలిపి తాపిచ్చు. తెల్లారేప్పటికి తేరుకుంటాడు. బయం లేదుపోయే, నే సెప్పినా సూడుమల్ల!"

రెడ్డమ్మా, బాలమ్మా చాలా మంచివాళ్ళుగా కనిపించినారు బోడికి. అంతకుముందురోజు వూరికే తను వాళ్ళింటి కొచ్చినందుకు వాళ్ళు తిట్టిన తిట్లన్నీ మరిచిపోయింది. మరచిపోడం కూడా కాదు, అవెప్పుడూ జ్ఞాపకం లేవు: వాళ్ళ ఈ 'మంచితనం' మాత్రమే గుర్తుంచుకుంది బోడి.

రెడ్డమ్మ, అంత హామీ ఇచ్చిన మందుకు కర్రోడు కోలుకోలేదు. బోడి యెత్తుకోడానిక్కూడా వల్లగాకుండా మంచంలో పడిపోయినాడు. ఆసుపత్రిలకు తీసకపోయి చూపిచ్చుకుంటానని మళ్ళా అడిగింది నాగి.

"ఆమనికాలం. కళ్ళంలో మాసూల్లు. ఒక పక్కన పసులీతగాడు లేకపాయె. ఉండు..... పోదులే వుసిచూసుకుని. ఒక్కరోజుగాదు, నాల్రోజులు లేకపోయినా యెట్లానో మేం చేసుకుంటాం."

ఆ తర్వాత ఆసుపత్రిలకని నాగి అడగాల్సినపనే లేకపోయింది.

బోడి, రెడ్డమ్మ ఇంటి ముందర కసపూడుస్తోంది. బాలమ్మ కొడుకు వీధి అరుగు యెక్కబోయి యెక్కడం చేతకాక, దిగడానికి భయపడి పోయి యేడుస్తున్నాడు. ఇంట్లోనించీ యెవరూ రాలేదు. బోడి పొరక అక్కడే పడేసి పోయి అందుకున్నది. ఒళ్ళో.... మెత్తగా............ చల్లగా హాయిగా వుంది. నాల్రోజుల కింద, ఆపిల్లవాడు కడుపు నొప్పిలేసి, కేకేసి వొకటే యేడ్పు. బాలమ్మ యేడుస్తోంది, రెడ్డమ్మ తత్తరపడుతోంది. అప్పుడే వూళ్లో జనం పిల్లా పెద్దా పోగయినారు. ఎవరో కడుపునొప్పేమో వాముపోసి చూడమన్నారు. "అట్టాంటివాట్తో పోతాదా? ఆసుపత్రికు తీసుకపోదాం, ఒరే అబ్బీ!" రెడ్డమ్మ పరుగెత్తి ఈదిలో కొడుకును పిల్చింది. రామిరెడ్డి "టాకటేరు" నడుపుకునొచ్చి నాడు. మరుసనాడు మద్దినాలకు మళ్ళా అదే టాకటేరునించీ దిగినారు.

నూర్రూపాయలు కర్సయిందనీ, పాడుడబ్బు పోయినా పిల్లవాడికి గండం

తప్పిపోయిందనీ, తను అండనే ఆసుపత్రిరను తీసుకపోబట్టి సరిపోయిందనీ, వచ్చిన వాళ్ళందర్తో రెండు మూడ్రోజులు సెప్పింది రెడ్డమ్మ.

బోడికెందుకో, ఆమెత్తని....... చల్లని....... చిరునవ్వుల పిల్లవాన్నెత్తుకున్నప్పుడు కర్రోన్నెత్తుకున్నట్టు గ్యాపకమొచ్చింది. "మా కర్రోడు సచ్చిపోయినాడు" అనుకుంది. కర్రోడు సచ్చినప్పుడు రానియేడుపు అప్పుడొచ్చింది. బోడి తన్నెత్తుకోడం ఇష్టంలేని పిల్లవాడు కాళ్ళూ చేతులూ, విదిలిస్తూ గట్టిగా అరిచినాడు. కిందికి దించేసింది. రెడ్డమ్మ ఆదుర్దాగా బైటికొచ్చిందప్పుడు.

"ఏమే, యేమయింది పిల్లవాడికి? యెందుకేడిసినాడు?" అనడిగింది. బోడి పలకలేదు.

"కింద పన్నాడేమో. ఇక్కడేవున్నా సూల్లేదేమే! పలికి చావవే" అప్పటికీ పలకలేదు.

"ఒసి నీయమ్మా! ఇంతగా పిలిచినా పలకవు. ఎంత పొగరే నీకు? దయ్యంలంజా......" బోడి తలమీద కొట్టడానికి చెయ్యెత్తింది రెడ్డమ్మ. బోడి కట్టుకదలకుండా నిలబడింది. కళ్ళార్పకుండా చూస్తోంది. ముందుకు పడిన దాని చింపిరి జుట్టు సందున రెండుకళ్ళూ, బూడిద కుప్పకింద రెండు నిప్పుల్లా వున్నాయి. రెడ్డమ్మ బలమైనచేయి హఠాత్తుగా ఆగిపోయి, అక్కన్నించీ పడిపోయినట్టుగా వాలిపోయింది. పిల్ల వాన్నెత్తుకోడం మరచిపోయి బెదిరినట్టుగా ఇంట్లోకి పోయింది. ఇంట్లోకి పోయినా, ఇంకా ఆమె గుండెకుదుట పడలేదు. బోడిని ఎన్నిసార్లు తిట్టలేదు, ఎన్నిసార్లు కొట్టలేదు. . . . అప్పుడెప్పుడూ ఇట్లా లేదు బోడి. ఆ పిల్లదాన్ని ........... యేటెయ్యడానికి ఎందు కంత యెనకాడింది? "నిజంగా ఎందుకో దాన్జూత్తూనే బయమయింది మల్ల!" - ఎందుకు?

# -- కథ గురించి. . .

1976 'ఆంధ్రజ్యోతి' దీపావళి ప్రత్యేకసంచికలో ప్రచురితమై, ఆ తర్వాత 1992 లో వెలువడిన 'సీమకథలు' సంకలనంలో కూడా వచ్చింది. భూస్వామ్య పెత్తం దారీతనాన్ని మొరటైన కళారహితమైన రూపంలో కాకుండా, కొంచెం మార్దవంగానూ లౌక్యంగానూ కనిపిస్తూనే బడుగు జీవితాల్ని శాసించగలగడాన్ని చూపించాలన్నది కథాలక్ష్యం.

ఈ కథకు నేను మొదట నిర్ణయించిన పేరు 'కర్రోడు చచ్చిపోయినాడు' అన్నది. దాన్ని 'ఆంధ్రజ్యోతి' సంపాదకుడు పురాణం 'కర్రోడిచావు' గా కుదించారు. అదే పేరుతో సీమ కథల్లోనూ వచ్చింది. దీని కంటే, నేను మొదటవుంచిన పేరే నిర్దిష్టతను సూచించేదిగానూ, నేరస్తుల్ని సంకేతించేది గానూ వున్నట్టు భావించి, మళ్లీ మొదటి పేరునే వుంచుతున్నాను.